జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 31-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 86 పేజీలు: 8 వెల : రూ.7




జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 31-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 86 పేజీలు: 8 వెల: రూ.7




# దుర్మరణం







*** అతివేగం.. రెండు ప్రాణాలు బలి * పైడిభీమవరం వద్ద ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొన్న బైక్ * ఇద్దరు మృతి* మందస మండలంలో విషాద ఛాయలు**

**రణస్థలం/మందస, జులై 30 (వార్త):** అతివేగం.. ప్రమాదకరమని పోలీసులు మొత్తుకుంటునే ఉన్నారు. ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీలు చేస్తూ వాహనచోదకులకు హెచ్చరికలు చేస్తునే ఉన్నారు. అయినా కొందరు స్పీడ్‌గా వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జాతీయ రహదారిపై రయ్‌రయ్‌మని వెళుతూ ప్రమాదాలకు గురవుతూ కుటుంబాలకు విషాదాన్ని నింపుతున్నారు. రణస్థలం మండలంలోని జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతూ ఇద్దరు పైడిభీమవరం వద్ద ఫ్లైఓవర్‌ను ఢీకొని మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళితే.. మందస మండలం బొగాబంద పం చాయతీ కడుముసాయి గ్రామానికి చెందిన సవర హర్యాని(25), సవర జీవన్ (20)లు బంధువులు. వీరు ద్విచక్రవాహనంపై కాకినాడ జిల్లా తునిలో మంగళవారం మధ్యాహ్నం బయలుదేరారు. రాత్రి 9గంటల సమయంలో పైడిభీమవరం ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. హర్యాని అక్కడికక్కడే మృతిచెందగా.. జీవన్ ఫ్లైఓవర్ మీద నుంచి కిందకు పడి మృత్యువాత పడ్డాడు. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఏం జరిగిందన్న దానిపై అక్కడికి చేరుకున్నారు. ఇద్దరు దుర్మరణం పాలవ్వడాన్ని చూసి జేఆర్ పురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుల ఫోన్‌ల ద్వారా వీరు మందస మండలవాసులుగా గుర్తించారు. వెంటనే వారి కుటుంబీకులకు సమాచారం అందించారు. హర్యానికి వెంకటేష్‌తో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న పాప ఉంది. జీవన్ తునిలో కుక్‌గా పనిచేస్తున్నాడు. వెంకటేష్‌కు జీవన్ సోదరుడు వరుస అవుతాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జేఆర్‌పురం పోలీసులు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు దుర్మరణం పాలవ్వడంతో కడుముసాయి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సాగర తీరానికి.. పూర్వవైభవం తీసుకొస్తాం

*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి కె.మత్స్యలేశం వద్ద కోతకు గురైన ప్రాంతం పరిశీలన * శాలిహుండం ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష**



**గార, జులై 30 (వార్త):** జిల్లాలోని సాగరతీరానికి పూర్వవైభవం తీసుకొస్తామని, మత్స్యలేశం గ్రామస్తులకు వరద ముంపు నుంచి కాపాడేందుకు రక్షణ చర్యలు చేపడతామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కె.మత్స్యలేశం గ్రామం వద్ద కోతకు గురైన సముద్ర తీరాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే తీరప్రాంత వాసులు దినదినగండంగా గడుపుతున్నారని తెలిపారు. వంశధార నదికి ఆవలి వైపు పోలాకి మండలం పరిధిలో గతంలో అక్రమంగా నదీ గర్భాన్ని ఆక్రమించుకొని రొయ్యల చెరువులను నిర్మించారని, దీంతో నదిలో నీటి ప్రవాహ దిశ మారిపోయిందని తెలిపారు. ఫలితంగా గార మండలం పరిధి కళింగపట్నం-మత్స్యలేశం ప్రాంతం కోతకు గురవుతోందన్నారు. ఈ సమస్యను గుర్తించి అధికారులు అప్పట్లో చర్యలు చేపట్టినా నదిలో నీటి ప్రవాహ దిశ మాత్రం మారలేదన్నారు. ఏటా వంశధారకు వస్తున్న వరదల కారణంగా తీరం మరింత కోతకు గురవుతోందని తెలిపారు. రక్షణ చర్యల్లో భాగంగా గతంలో నిధులు మంజూరైనప్పటికీ గత ప్రభుత్వం దానిని నీటి పాలు చేసిందన్నారు. 2020 జూన్‌లో జలవనరులశాఖ ద్వారా రూ.7.54 కోట్లు కేటాయించినప్పటికీ పనులు మాత్రం జరగలేదన్నారు. పరస్థితిని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి తక్షణమే తీరం కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం అసంపూర్తిగా నిలిచిపోయిన వనిత మండలం వంతెన, శాలిహుండం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు, కాలువల ద్వారా సాగునీరు రాని సమయంలో రైతులను ఆదుకుంటుందని ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తయినప్పటికీ ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పథకాన్ని గాలికొదిలేసి రైతులను నట్టేట ముంచిందని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వనిత మండలం వంతెన నిర్మాణం రూ. 72 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమయ్యాయని, 70శాతం పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయడానికి పూర్తిగా నిర్లక్ష్యం చూపిందని తెలిపారు. టీడీపీ హయాంలో చేపట్టిన పనులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే శాలిహుండాం పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పనులు నిలిచిపోవడానికి గల కారణాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వీటి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపుతామని తెలిపారు. వీరితో పాటు అధికార బృందం, టీడీపీ నాయకులు పర్యటించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరి

*** ఎత్తిపోతల పథకం ద్వారా అందని నీరు**
*** ఇబ్బందులు పడుతున్న కిట్టాలపాడు,పూనిపేట రైతులు**
*** ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన రైతులు**



**హిరమండలం, జులై 30 (వార్త):** మండలంలో కిట్టాలపాడు ఎడమ కాలువ పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్ ఫార్మర్ లోపల ఉన్న కాపర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మంగళవారం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ను చూసి అవాక్కయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరికి గురైందని గ్రహించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందజేశారు. ఈ మేరకు ఎస్ఐ జి.నారాయణ స్వామి సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు రైతులు జి.లజపతి, ఎల్.శ్రీనివాసరావు, ఎస్.గోవిందరావు, జి.మన్మధరావు, ఎల్.తిరుపతిరావు మాట్లాడుతూ చోరీకి గురైన ట్రాన్సఫార్మర్ సామాగ్రి సుమారు రూ.8లక్షల మేర ఉంటుందన్నారు. దీని వలన ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, దీని పరిధిలో కిట్టాలపాడు, పూనిపేట గ్రామాలకు చెందిన 350 మంది రైతులకు సంబంధించిన ఆరు వందల ఎకరాలకు భూములకు నీరందకుండా పోయిందన్నారు. దీనిపై పాతపట్నం నియోజకవర్గ ఎంఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లామని రైతులు తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి తక్షణమే ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## రైతుల క్షేమం కోరే ప్రభుత్వమిది

**కంచిలి, జులై 30 (వార్త):** రైతుల క్షేమం కోరే ప్రభుత్వమిదని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మాదిన రామారావు అన్నారు. మంగళవారం మండపల్లి పంచాయతీలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వర్షాలు లేక ప్రజలందరూ నానాఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విస్తారంగా వర్షాలు పడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వెంకటరావు దామోదర్ గోపి కృష్ణారావు హార్టికల్చర్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గరంగరంగా కౌన్సిల్ సమావేశం

*** వార్డుల అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తిన వైసీపీ కౌన్సిలర్లు * ఐదేళ్లు ప్రభుత్వం మీదేగా ఏం చేశారు: ఎమ్మెల్యే శిరీష**





**పలాస, జులై 30 (వార్త):** మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశం గరంగరంగా సాగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. వైసీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమతమ వార్డుల్లో అభివృద్ధి పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మీ ప్రభుత్వమే ఉందిగా.. అప్పుడేం చేశారని ప్రశ్నించారు. మంత్రిని ఎందుకు అడగలేక పోయారని నిలదీశారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మురికిపాలిటీగా తయారైందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి గతంలో ఎంపీ నిధులను కేటాయిస్తే పలాస నియోజకవర్గంలో ఆ నిధులు వినియోగించకుండా అప్పటి ప్రజాప్రతినిధి అడ్డుపడడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీ వెనుకబాటుతనానికి గత పాలకుల అసమర్ధతే కారణమన్నారు. తాను రాజకీయాలను పక్కనపెట్టి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీ నిధుల నుంచి 50 శాతం వరకు నిధులను మున్సిపాలిటీలోనే ఖర్చు చేస్తామని చెప్పారు. ఎన్నికల పబ్లిసిటీకి కేటీ రోడ్డు విస్తరణ పనులను వైసిపి నాయకుడు చూపించుకున్నప్పటికీ ఎన్నో అవకతవకలు జరిగినట్లు అందరికీ తెలుసన్నారు. గత మూడేళ్లలో టీడీపీ నుంచి కౌన్సిలర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో పక్షపాత వైఖరి చూపారని మండిపడ్డారు. తాను కక్షసాధింపు చర్యలకు పాల్పడబోనని స్పష్టం చేశారు. 27వ వార్డు కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ పలు శాఖధికారుల గైర్హాజరుపై కమిషనర్‌ను ప్రశ్నించారు. అధికారులు గత మూడేళ్లుగా ఓ పద్ధతికి అలవాటు పడిపోయారని, ఆ అలవాటును మారేలా చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే శిరీష అన్నారు. టేబుల్ అజెండాలో తాపీ మేస్త్రిల భవన నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని చేర్చాలని రెండు రోజుల కిందట ఎమ్మెల్యే సూచించారు. అయితే కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు అజెండా ప్రతుల్లో ఆ అంశం లేకపోవడంతో ప్రశ్నించారు. దీంతో అధికారులు స్పందించి అప్పటికప్పుడే 20వ అంశంగా చేర్చడం గమనార్హం. ఈ అంశమై కౌన్సిలర్లు వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణలు అధికారుల బాధ్యతా రాహిత్యంపై అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, మున్సిపాలిటీకి రూ.42.94 లక్షలు మంజూరైనట్టు కమిషనర్ నాగేంద్రకుమార్ సభలో ప్రకటించారు. మొదటి దశలో కాశీబుగ్గలోని అన్నా క్యాంటీన్ పునఃప్రారంభానికి మార్గనిర్దేశకాలు అందినట్టు చెప్పారు. ఇప్పటికే పనులు పూర్తయ్యాయని, ఆగస్టు మొదటివారంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ లు మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్లు తంగుడు ఆశాలత, డొక్కరి త్రివేణి, ఆనందు, దువ్వాడ శ్రీకాంత్, గుజ్జు జోగారావు, దుర్గ శంకర్ పండా, సనపుల సింహాచలం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పర్యావరణ రక్షణకు మొక్కలు నాటండి

**సారవకోట, జులై 30 (వార్త):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. మంగళవారం సారవకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. మానవ మనుగడకు మొక్కలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర్మినాయుడు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే గిరిజనులు పండిస్తున్న పంటలను ఎగుమతి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం సారవకోట మండల పరిషత్ కార్యాలయంలో వన్ దన్ వికాస్ కేంద్రాలకు కొండ చీపుర్ల తయారు చేసే యంత్రాలను పంపిణీ చేశారు. సుమారు తొమ్మిది లక్షలతో పది యూనిట్లను పది మహిళా గ్రూపులకు అందజేశారు.

**నరసన్నపేట:** రైతులకు సకాలంలో ఎరువులను అందజేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం మబుగాంలోని తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలోని రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. పంటపొలాలు పరిశీలించి రైతులకు సాగులో మెలకువలు, తదితర అంశాలపై సూచనలు చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, ఏడీ రవీంద్రభారతి మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## మూడు వారాల నారు నాటాలి

**సారవకోట, జులై 30 (వార్త):** మూడు వారాల వయసు ఉన్న వరి నారును నాటితే ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందని సారవకోట మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు తెలిపారు. నారు చిగురులు తుంచి నాటడం వల్ల 45 రోజుల వరకు కాండం తొలిచే పురుగు ఆశించదన్నారు. చదరపు మీటరు విస్తీర్ణంలో 44 కుదుర్లు ఉండేలా నారును నాటాలని చెప్పారు. పంట దమ్ము చేసిన ఎకరా విస్తీర్ణంలో మొదటి ఎరువుగా 50 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువును వేసి పైపైన నాట్లు వేయాలన్నారు.

## రేషన్ సరకుల పంపిణీపై ప్రజాభిప్రాయ సేకరణ

**నరసన్నపేట, జులై 30 (వార్త):** ప్రజా పంపిణీ విధానంపై సర్వే నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ బి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఎంఎల్ఎస్ కేంద్రంలో మాట్లాడుతూ ప్రజాపంపిణీపై నూతన ప్రభుత్వం పలు మార్పులు, చేర్పుల్లో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తుందన్నారు. నిత్యావసర సరకుల పంపిణీ, వాటిలో లోపాలు గుర్తించి సరిదిద్దడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.


## మరో 16 గ్రామాలకు నీరందిస్తాం

**జలుమూరు, జులై 30 (వార్త):** శ్రీముఖలింగం రక్షిత మంచినీటి టాంక్ నుంచి 46 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని, మరో 16 గ్రామాలకు అందించేందుకు తగు చర్యలు చేపడుతున్నామని నరసన్నపేట గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ జల్లు సుదర్శన్ అన్నారు. అచ్చుతాపురం వద్ద ఉన్న శ్రీముఖలింగం సమగ్ర రక్షిత నీటి పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గుర్తించిన సాంకేతిక సమస్యలు, ఇతర లోపాలను సరిచేశామన్నారు. ప్రజలకు సక్రమంగా నీరందించేలా అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

# బూరగాంలో దారి తప్పిన ఉపాధి పథకం

*** వైసీపీ అండతో అక్రమాలకు తెరలేపిన ఫీల్డ్ అసిస్టెంట్ * ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ * విచారణలో బయటపడ్డ వాస్తవాలు**

**టెక్కలి, జులై 30 (వార్త):** బూరగాం పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జనపాన తిరుమలరెడ్డి గత ప్రభుత్వం వైయస్సార్ పార్టీ అండతో అక్రమాలకు తెర లేపారు. తన భార్య విజయలక్ష్మి ఎంపిటిసి కావడం తను ఫీల్డ్ అసిస్టెంట్ కావడంతో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అక్రమంగా నిధులు మింగేసారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం స్థానిక సచివాలయ కేంద్రంలో టెక్కలి క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడి శైలజ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. జనపన తిరుమలరెడ్డి అనే ఫీల్డ్ అసిస్టెంట్ ఎంపీటీసీ ప్రతినిధి కావడం వలన గత వైసిపి ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని రాజకీయ నాయకుల అండదండలతో లక్షలాది



రూపాయలు వరకు అక్రమంగా కాజేసుకున్నాడని బాధితులు వాపోయారు. పనికి వెళ్ళని వారి పేర్లు పైన మస్టర్లు వేసి వారి బ్యాంక్ అకౌంట్లో వేతనాలు జమ చేసి వారి నుండి సొమ్ములు తీసుకున్నాడని పలువురు ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ప్రభుత్వపరంగా రావాల్సిన రాయితీలు ఆపేస్తామంటూ చెప్పాడని పలువురు లబ్ధిదారులు దర్యాప్తులో వెల్లడైంది. అదేవిధంగా వారానికి వేతన దారుల నుండి వంద రూపాయలు వసూలు చేశారని, ఒకరికి బదులుగా ఇంకొకరు పేరున మస్టర్లు వేసి నిధులు స్వాహా చేసుకున్నారనే విషయాలు విచారణలో పలువురు తెలిపారు. రాజకీయ కక్షతో గత ప్రభుత్వం హయాంలో తెలుగుదేశం కుటుంబ సభ్యుల పూర్తిగా పని కల్పించకుండా చేశారని వేతనదారులు మండిపడ్డారు. విచారణలో ఫిర్యాదులన్నీ వాస్తవంగా వెలుపడ్డాయి వేతన్దారులు ఫిర్యాదులు లిఖితపూర్వకంగా ఏపీడీ శైలజాకి అందించారు. ఈ విధంగా అధికారాన్ని అవకతవకలు పాల్పడిన తిరుమలరెడ్డి అనే క్షేత్ర సహాయకుడుకు అధికారులు వివరణ అడిగారు. తిరుమలరెడ్డి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఏపిడి శైలజ మండిపడి సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన వాస్తవాలు రిపోర్టు రూపంలో పై అధికారులకు పంపించి చట్టపరంగా చర్యలు తీసుకొని ఎంత నిధులు దుర్వినియోగం అయ్యాయో అంతటినీ రికవరీ చేస్తామని తెలియజేశారు.

# అసమానతలు లేని సమాజానికి పోరాడాలి

### న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మాధవరావు

**పలాస, జులై 30(వార్త):** అసమానతలు లేని సమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వంకల మాధవరావు అన్నారు. డాక్టర్ మల్లికార్జున్, దుమ్ము అప్పలస్వామి, ఉర్లాం మల్లేశ్వరరావుల 52వ వర్ధంతి సభను సూదికొండలోని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం ఎందరో పోరాడి ప్రాణాలను వదిలారన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు లో కామ్రేడ్ డాక్టర్ మల్లికార్జున జన్మించి డాక్టర్ వృత్తి పూర్తి చేసుకొని పాండిచ్చేరి యూనివర్సిటీలో పీజీ చేశారన్నారు. ఉన్నతమైన ఉద్యోగం వదిలి ఆకలి అసమానతలు పేదరికం లేని ఒక కొత్త సమాజం కావాలని కోరుతూ శ్రీకాకుళం వచ్చి ఇక్కడ ఆదివాసీలతో కలిసి ఈ ప్రాంతంలో మహేంద్రగిరి ప్రాంతంలో, చందనగిరి ప్రాంతంలో దళాలకు నాయకత్వం వహించారన్నారు. 1970 జూలై 30న మందస మండలం రామరాయి కొండలలో పోలీసులు ఆయనతో పాటు మల్లేశ్వరరావులను కాల్చి చంపారన్నారు. దుమ్ము అప్పలస్వామి అండమాన్ లో ఉద్యోగం వదిలి ఈ ప్రాంతంలో జరుగుతున్న సాయుధ పోరులో పాల్గొని తన ప్రాణాలను ధార పోశారు. మల్లేశ్వరరావు వాళ్ళ నాన్న గ్రామ కర్ణంగా ఉంటూ ఉద్యమంలో తమ ప్రాణాలను వదిలారని చెప్పారు. వారు ఎల్లకాలం ప్రజలు హృదయాలలో బతికే ఉంటారన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో మోడీ ,చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా విభజన చట్టం అమలు విషయంలో మోడీతో చంద్రబాబు రాజీ పడడం సరైనది కాదన్నారు. ప్రత్యేక హోదా విభజన చట్టం అమలు కోసం చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఉద్యమాలు నిర్మిస్తామని మాధవరావు తెలిపారు. ఆయనతో పాటుగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు వంకల పాపయ్య, మురిపింటి తాతారావు, జుత్తు. కృష్ణారావు, పిఓడబ్ల్యు నాయకులను సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## టెన్త్ టాపర్‌కి 'మనబడి' సన్మానం

**సంతబొమ్మాళి, జులై 30 (వార్త):** సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదవ తరగతి ఫలితాలలో ద్వితీయ స్థానంలో నిలిచిన సాదు దేవికి మనబడి అసోసియేషన్ మంగళవారం ఘనంగా సన్మానించింది. వల్లేవలస మనబడి అసోసియేషన్ స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు సమక్షంలో దుస్సాలువతో సత్కరించి నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జలుమూరు చిన్నవాడు, డి అర్జునుడు, ప్రధానోపాధ్యాయుడు బరాటం కామరాజు, మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టారు, గేదెల శివారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ముఖలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

**జలుమూరు, జులై30 (వార్త):** శ్రీముఖలింగేశ్వర స్వామివారి దేవ స్థానంలో హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖాధికారి రవి ఆధ్వర్యంలో మంగళ వారం లెక్కించారు. నాలుగు నెలల 18 రోజులకు గాను రూ 3,90,013 ఆదాయం వచ్చినట్టు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణపై అవగాహన అవసరం



**పోలాకి, జులై30 (వార్త):** రైతులకు యాంత్రీకరణపై అవగాహన అవసర మని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్ అన్నారు. మంగళవారం మబగాంలో వ్యవసాయ యంత్రంతో వేస్తున్న వరినాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల కొరత అధిగమించేందుకు రైతులు వ్యవసాయ యంత్రాలతో నాట్లు వేసుకోవడం మంచిదన్నారు. అలాగే ఎరువుల యాజ మాన్యం, అధిక యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్య క్రమంలో మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## రహదారికి అడ్డుగా ఉన్న దుకాణాల తొలగింపు



**నరసన్నపేట, జులై 30 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలోని శాంతామణి ఆలయం రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను ఈవో ఎస్.చిన్నారావు తొలగించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్న దృష్ట్యా ఈ దుకాణాలను తొలగించామన్నారు. ఈ దుకాణాలు అడ్డుగా ఉన్నాయని పలువురు ఫిర్యాదు చేయడంతో వీటిని ఇక్కడి నుంచి తొలగించామన్నారు.

## బ్రెయిన్ ట్యూమర్ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

**సంతబొమ్మాళి, జులై 30(వార్త):** భావనపాడు గ్రామానికి చెందిన బై సోమేశ్వరరావు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక స్తోమత లేనందున ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నాడు. ఈ వ్యాధికు ఆరోగ్యశ్రీ వర్తించదని డాక్టర్లు చెప్పడంతో లక్షలాది రూపాయలు ఆపరేషన్‌కు ఖర్చవు తుందని డాక్టర్లు పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ వ్యాధి సంబంధించిన ఆపరే ఓషన్ చేసినట్లయినా వ్యాధి నయమవుతుందో లేదో చెప్పలేమని డాక్టర్లు వెల్లడించడంతో చివరకు ఇంటి వద్ద వైద్యము చేసుకోవలసిన దుస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇటీవలే సోషల్ మీడియాలో బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న సోమేశ్వరరావు వార్త వైరల్ అయింది. దీంతో యువతరం సేవా సమితి సభ్యులు స్పందిస్తూ రూ.15 వేలు సోమేశ్వరరావు వైద్య ఖర్చులు నిమిత్తం మంగళవారం అతని భార్యకు చెక్కు రూపంలో అందజేశారు. దాతలు ముందుకు వచ్చి సోమేశ్వరరావును ఆదుకోవాలని యువతరం సేవా సమితి సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చింత మురళి, గోరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు, బత్తిని విగ్నేష్, బత్తిని లక్షణరావు, తులసిరావు, వెంకటేష్, రమేష్, భావనపాడు తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు అడ్ల దానేసు, బై తులసీదాసు పాల్గొన్నారు.



### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

# నర్సాపురం పాఠశాల ఆవరణ

* పాఠశాల ప్రాంగణంలో మద్యం సీసాలు * నిత్యం శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు











**సంతబొమ్మాళి, జులై30 (వార్త):** నర్సాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణాన్ని మందుబాబులో తమ అడ్డాగా మార్చుకుం టున్నారు. రాత్రయితే చాలు మందుబాబులు పాఠ శాల ఆవరణలో మద్యం తాగి ఖాళీ సీసాలను పడబోస్తున్నారు. ప్రతిరోజూ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి శుభ్రం చేసుకుంటున్నారు. ఇక్కడ నిత్యం ఇదే తంతుగా మారింది. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు గ్రామస్థుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ మందుబాబులు తమ తీరును మార్చుకోవడం లేదు. కొందరు విద్యార్థుల తరగతి గదిలో ఉన్న ఫ్యాన్ రెక్కలను ధ్వంసం చేశారు. ఏ గోడ చూసినా కిల్లి, గుట్కా, ఖైనీ ఉమ్ములతో అపరిశుభ్రంగా మారింది. పాఠశాలకు కాంపౌండ్ వాల్ ఉన్నప్పటికి ఈ సమస్య ఎదుర్కొంటున్నామని ప్రధానోపాధ్యాయుడు ఆరంగి గోవిందరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు పాఠశాల ఆవరణను పానశాలగా మార్చేశారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పోలీసులు, విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఓటమి గెలుపునకు మెట్టు



**ఇచ్ఛాపురం, జులై 30(వార్త):** ఓటమి గెలుపునకు మెట్టు అని, పరాజయం నుంచే విజయం వస్తుందని మోటివేషనల్ స్పీకర్ పి.చిరంజీవి అన్నారు. మంగళవారం జెసిస్ క్లబ్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైలర్‌గా జె సి ఐ విశాఖపట్నం వారియర్స్ క్లబ్ సభ్యునిగా, మోటివేషన్ స్పీకర్‌గా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిలకు ప్రత్యేక శిక్షణా తరగతు లను నిర్వహించారు. స్టడీ టిప్స్, టైం మేనేజ్మెంట్, కమ్యూనికేషన్స్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశలో ఎదురయ్యే ఫెయిల్యూర్స్‌ని ఎదుర్కొనే మానసిక పరిస్థితిని మెరుగుపరచు కోవాలని, ఫెయిల్యూర్స్‌ని స్వీకరించాలని, మరలా ప్రయత్నించాలని, ప్రయత్నించకపోవడమే నిజమైన ఫెయిల్యూర్ అని చెప్పారు. విమర్శలకు స్పందించ కుండా.. లక్ష్యంపైనే దృష్టి పెట్టాలన్నారు. విమర్శించే వారికి ఇచ్చే గట్టి సమాధానం అదేనన్నారు. 4 డి టెక్నిక్ ద్వారా చదువుకునే సమయాన్ని అద్భుతంగా మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. చేయు, వాయిదా, బదలాయింపు, తొలగింపు.. ఈ నాలుగు టెక్నిక్స్ ద్వారా చదువుపై దృష్టి పెరుగుతుందన్నారు. విజయం సాధించాలనుకునే విద్యార్థులకు టైం మేనేజ్మెంట్ చాలా ముఖ్యమన్నారు. సబ్జెక్టులు వారీగా ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా ప్రతి సబ్జెక్టు పై పట్టు సాధించవచ్చని చెప్పారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, సంభాషణ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, భాషపై పట్టు సాధించాలని, ఇంగ్లీషులో కమ్యూనికేషన్స్ స్కిల్స్ మెరుగు కావాలంటే ఉపాధ్యాయుల సమక్షంలో తోటి విద్యార్థులతో అభ్యసించాలన్నారు. ఆంగ్ల భాష పై, ఉచ్చారణ పై పట్టు రావాలంటే ఇంగ్లీష్ న్యూస్ పేపర్స్, ఇంగ్లీష్ న్యూస్ చానల్స్, ఇంగ్లీష్ స్టోరీ బుక్స్, ఇంగ్లీష్ కామిక్ బుక్స్ ఫాలో కావాలని చెప్పారు. ఈ అవకాశం కల్పించిన ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మకు విద్యార్థినులు ధన్యవాదాలు తెలియజేశారు.

# మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

* సివిల్ జడ్జి సన్యాసి నాయుడు
* కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

**శ్రీకాకుళం లీగల్, జులై 30(వార్త):** నగరంలోని మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చట్టరీత్యానేరమన్నారు. కొందరు పిల్లలను ఇంటి పనులకు వినియోగిస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. ఎక్కువగా మహిళలే అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్ చేస్తే వెంటనే అధ్యాపకుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ర్యాగింగ్ పాల్పడడం నేరమన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. సాంకేతికతను అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



### వెలుగులోకి

# ఉపాధి అక్రమాలు

*మస్టర్ల దిద్దుబాట్లుపై పీడీ చిట్టిరాజు ఆరా * సిబ్బందిపై ఆగ్రహం



**ఎల్‌ఎన్‌పేట, జులై 30 (వార్త):** ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని డ్వామా పీడి. చిట్టిరాజు సిబ్బందిపై మండిపడ్డారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవ రణలో ఎంపిపి రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క పంచాయితీకు సంబంధించిన నివేదికలలో ఎల్‌ఎన్‌పేట, యంబరాం, కోవిలాం, శ్యామలాపురం, బొర్రంపేట, డొంకలబడవంజ, కరకవలస, పెద్దకోట తదితర గ్రామాలలో వేతనదారుల మస్టర్లు దిద్దుబాట్లు, సంతకాలు లేకుండా మస్టర్లు, కొలతల్లో చాలా తేడాలు ఉన్నాయని సామాజిక తనిఖీబృందం ప్రజావేదికలో వెల్లడించింది. దీనిపై స్పందించిన పీడీ ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పలు పంచాయతీలలో రెవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు లేవని, కొన్ని గ్రామాల్లో ఒకే రేషన్ కార్డుకు రెండేసి ఓఏపి పించన్లు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పలు పించన్లు మంజూరు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. కోవిలాం, మోదుగువలస గ్రామాలలో ప్రజలకు, ఇరు వర్గాల వారికి సమా చారం లేకుండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, సామాజిక తనిఖీ నిర్వహించడం ఏమిటని కోవిలాం ఎంపిటిసి ప్రతినిధి లోచర్ల మల్లేశ్వరరావు, మోదుగు వలస గ్రామ టిడిపి ప్రతినిధి గుండపు గణేష్ పీడి దృష్టికి తీసుకువచ్చారు. విధి నిర్వహణలో మరోసారి అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి రాధ, విజిలెన్స్ అధికారి లవరాజు, ఎస్ఆర్పి ఎం.తిరుపతిరావు, వెలుగు డివిఎం.సిహెచ్. రామ్మోహన్రావు, ఎన్ టీ ఎం వై.గౌరీశంకర్, ఏంపీడీవో గిరిబాల, ఏపివో శ్రీదేవి, ఏపిఎం రంగరాజు, పలువురు సర్పంచ్లు, ఎంపీ టిసీలు, టిఏలు, ఫీల్అసిస్టెంటులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ముగిసిన ఆవేటి వారోత్సవాలు

**హిరమండలం, జూలై 30 (వార్త):** వానలు సకాలంలో కురిసి రైతులు వేసిన పంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో మైత్రీకాలనీ, అంధవరపు, అంగూరు, కోరాడ, బ్రాహ్మణ, గిరిజాల వీధుల్లో చెవిటమ్మతల్లి ఆవేటి వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ముఱ్రాటలు తీసుకెళ్లి చెవిటమ్మతల్లితో పాటు పాతపట్నం నీలమణిదుర్గా అమ్మవారికి చల్లదనం చేసారు.

# పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

* గ్రామాల్లో ఫాగింగ్ చేయటంలో రాష్ట్రంలో మొదటి స్థానం
* టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి వెంకటరమణ

**హిరమండలం, జులై 30 (వార్త):** ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరమణ సూచించారు.మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో అధిక శాతంలో లబ్ధిదారులను నమోదు చేయాలని సూచించార. విశ్వకర్మ యోజనలో భాగంగా గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని వడ్రంగులు, స్వర్ణకారులు, తాపీ మేస్త్రీలు, రాతి శిల్పులు, దర్జీలు,18 రకాల చేతి వృత్తుల పనుల వారు ఈ పథకానికి అర్హులన్నారు. దీని ద్వారా ఎటు వంటి గ్యారెంటీ లేకుండా ప్రభుత్వం రూ.3 లక్షల వరకు రుణం ఇస్తుందని, మొదటగా రూ.లక్ష ఇస్తారని, మొదటగా తీసుకున్న రుణాన్ని బ్యాంక్‌కు చెల్లించినట్లయితే మిగతా రూ.2లక్షలు అందజేస్తారన్నారు. ఈ పథకంలో తక్కువ వడ్డీకే 5 శాతం వడ్డీ





రేటుతో రుణం పొందవచ్చన్నారు. దీనిపై గ్రామాల్లో పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టెక్కలి డివిజన్ పరిధిలో 9 మండలాలకు 293 పంచాయతీల పరిధిలో గత ఏడాది ఇంటి పన్నుల బకాయలు కోటి 59 లక్షలు ఉన్నాయని, అందులో కోటి రూపాయల వరకు వసూళ్లు చేసామని, అధికంగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.40 లక్షల మేర బకాయలు రావాల్సి ఉందన్నారు. అలాగే దోమల నివారణకు 293 పంచాయతీల పరిధిలో 202 పంచాయతీల్లో శత శాతం ఫాగింగ్ నిర్వహించి, రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు.మిగతా గ్రామాల్లో 2,3 రోజుల్లో ఫాగింగ్ నిర్వహించటం జరగుతుందని, వర్షాల సీజన్‌లో భాగంగా ప్రతీ గ్రామంలో ఫాగింగ్‌తో పాటు స్ప్రేయింగ్,మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతీ పంచాయతీ కార్యదర్శి పిఆర్ఐ-1 యాప్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. అనంతరం పాత హిరమండలం వద్ద చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించి, ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతీ పంచాయతీ చెత్త సంపద కేంద్రాన్ని సద్వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని,దీని ద్వారా పంచాయతీ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు.ఈయనతో పాటు ఈఒపిఆర్‌డి నాగమణి,పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వైఎస్ఆర్ మూర్తి,జూనియర్ సహాయకులు అనకాపల్లి నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



## ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గొండు

**శ్రీకాకుళం క్రైం, జులై 30 (వార్త):** శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు.

## అపరిచితులకు దూరంగా ఉండండి




**శ్రీకాకుళం క్రైం, జూలై 30 (వార్త):**అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ మహిళా ఎస్ఐ రేవతి అన్నారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టి రామారావు మున్సిపల్ హై స్కూలులో విద్యార్థి, విద్యార్థునులతో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. తెలియని వ్యక్తులతో స్నేహం, పరిచయాలు మంచిదికాదన్నారు. సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లకు రెస్పాండ్ కాకూడదని చెప్పారు. అనంతరం ఉన్నత పాఠశాల నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆమదాలవలసలో 'ఆకలి' చిత్రం షూటింగ్



**ఆమదాలవలస, జులై 30 (వార్త):** కళింగ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై గూన అప్పారావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఆకలి చిత్రం షూటింగును స్థానిక పాలపోలమ్మ గుడి ఆవరణలో ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ చిత్రంలో హీరోలు ప్రకాష్, విక్రమ్, హీరోయిన్లుగా ప్రసన్న, స్రవంతి, నటులు సనపల అన్నాజీరావు, బమ్మిడి కృష్ణారావు, కుమార్ నాయక్, దుర్గా వెంకట గిరి, మోహనరావు, వెంకటరావు నటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మొదలవలస రమేష్, తంబి, తమ్మినేని శేఖర్ పాల్గొన్నారు.

# జీవో 117ను రద్దు చేయాలి

**మందస, జులై 30 (వార్త):** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల డిప్యూటీ తహసిల్దార్ మద్దిల కృష్ణమూర్తి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. రఘుపతిరావు, మండల విద్యాశాఖ అధికారి 2 ఎం. భాస్కరరావులకు యూటీఎఫ్ బృందం వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ జివో నెం 117 రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుండి మినహాయింపు ఇవ్వాలని, హైస్కూల్లో రెండు మీడియంలు సమాంతరంగా నడపాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు ఒకటి నుండి ఐదు తరగతులతో పాటు ఎల్కేజి, యూకేజి కలపాలని, పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలని, పెండింగ్లో వున్న నాడు-నేడు పనులు పూర్తి చేయాలని, విద్యా కానుక కిట్లు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా పూర్వక కార్యదర్శి రాజన పరమేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, మండల అధ్యక్షులు జగదీష్ బడిత్య, పూర్వపు మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు కొండలరావు మాధవరావు, మండల సహాధ్యక్షులు ప్రియాంక మహారాణా, సిపిఎస్ కన్వీనర్ దుగాణ మాధవరావు, జిల్లా కౌన్సిలర్లు తరుణి సోమేశ్వరరావు, పల్లి జగన్ మోహన్ రావు, ముదిలి రాము ధర్మవరపు కిరణ్ ,రాంప్రసా,ద్ అశోక్ కుమార్, పురేందర్ బిసాయి , మరి నరసింహమూర్తి, సుధాకర్ ఉన్నారు.

## పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

2003 డీఎస్సీ బ్యాచ్ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు 2003 డీఎస్సీ రాసిన నిరుద్యోగులు కోరారు. మంగళవారం వారు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సార భాస్కరరావు, రామకృష్ణ, శ్రీను, రామారావు అప్పారావు, శంకర్రావు ఉన్నారు.





# ఆర్టీసీ సేవలను మరింతగా విస్తరిస్తాం

* ఎమ్మెల్యే గొండు శంకర్ * నూతన బస్సులు ప్రారంభం



**శ్రీకాకుళం టౌన్, జులై 30 (వార్త):** ఆర్టీసీని సేవలను మరింత విస్తరిస్తామని. ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం నూతన బస్సులకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యార్థం శ్రీకాకుళం నుంచి విజయవాడకు, విజయనగరంనకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించామని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణతో పాటు, సిబ్బంది, కార్మికుల సంక్షేమం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలలోపే ప్రయాణీకుల సౌకర్యార్థం రాష్ట్ర వ్యాప్తంగా నూతన బస్సులను ప్రారంభిస్తున్నట్టు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై కూడిన ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తోందని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచితంగా ప్రయాణ అవకాశం కల్పిస్తామన్నానరు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సమస్యలపై అధికారులతో సమీక్షించారు. గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పర్యటించడం జరిగిందని వర్షం వస్తే ఈ ప్రాంతమంతా చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కార మార్గం చూపుతామన్నారు. అలాగే ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413